
సాక్షి అన్నమయ్య జిల్లా

ఆదివారం । 27 । ఏప్రిల్ । 2025



ట్రిపుల్ ఐటీలతో.. ఉజ్వల భవిష్యత్తు

రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ(ఆర్జీయూకేటీ)లో 2025-26 విద్యా సంవత్సరానికి అడ్మిషన్ల కోసం నోటిఫికేషన్ విడుదలైంది. -IIలో



ఉద్యోగాలు పీకేసిన పాపం బాబుదే

మంగంపేటలో ఉద్యోగాలు పీకేసిన పాపం సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేష్‌లదేనని మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. -IIలో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.90	రూ.110
రెండోరకం	రూ.60	రూ.80



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 403 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
సీబీ	326	326
బైవోల్టిన్	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 50.280 కిలోలు

న్యూస్‌రీల్

హార్సిలీహిల్స్ ఘాట్‌లో చిరుత

బి.కొత్తకోట: మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్ ఘాట్‌రోడ్డుపై చిరుత దర్శనమిచ్చింది. శుక్రవారం రాత్రి కొండపై దిగువకు వెళ్తున్న పర్యాటకుల కారుకు అడ్డంగా రోడ్డు దాటుతున్న చిరుత కెమెరాలో రికార్డయింది. కొండపైకి వచ్చిన సందర్శకులు పర్యటన ముగించుకుని తిరిగి వెళ్తుండగా మూడో మలుపు వద్ద ఎడమవైపు నుంచి కుడివైపు అడవిలోకి వెళ్లేందుకు చిరుత రోడ్డు దాటగా ఆ దృశ్యం కెమెరాలో నమోదవగా శనివారం ఈ వీడియో వైరల్ అయింది. కాగా దీనిపై హార్సిలీహిల్స్ సెక్షన్ ఆఫీసర్ అడపా శివకుమార్ మాట్లాడుతూ కొండలో చిరుతలు సంచరిస్తున్నాయని, పర్యాటకులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

జంతువుల ఆరోగ్య సంరక్షణలో పశువైద్యుల సేవ అనిర్వచనీయం

రాయచోటి: జంతువుల ఆరోగ్య సంరక్షణలో పశువైద్యుల సేవ అనిర్వచనీయమని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్లో జేసీ అధ్యక్షతన జిల్లా పశుసంవర్ధక శాఖఆధ్వర్యంలో ప్రపంచ పశువైద్య దినోత్సవాన్ని నిర్వహించారు. పశువైద్యుల సేవలను గౌరవించడం, పశువుల ఆరోగ్య సంరక్షణలో వారి పాత్రను గుర్తించడానికి ప్రపంచ పశు వైద్య దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం ఏప్రిల్ చివరి శనివారం రోజున జరుపుకుంటున్నట్లు జేసీ చెప్పారు. గ్రామీణ ప్రజల ముఖ్య జీవనాధారం వ్యవసాయం, పశుపోషణ అని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న కొన్ని లక్షల మూగజీవాలకు పశువైద్య సిబ్బందే అండగా నిలుస్తున్నారన్నారు. డీఆర్‌ఓ మధుసూదన్‌రావు మాట్లాడుతూ పశువైద్యులు కేవలం జంతు వైద్యులు మాత్రమే కాదని, ప్రజారోగ్య రక్షణలో ఫ్రంట్ లైన్‌వారియర్స్ అని అన్నారు. జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి గుణశేఖర్‌పిళ్లై మాట్లాడుతూ ఈ ఏడాది పశువైద్య దినోత్సవాన్ని ''యానిమల్ హెల్త్ టేక్స్ ఎ టీం''అనే థీంతో జరుపుకుంటున్నట్లు తెలిపారు. డాక్టర్ విశ్వేశ్వర్‌రెడ్డి,అత్తిరాల పశువైద్యురాలు భాగ్యవతి, మదనపల్లె, రాజంపేట, రాయచోటి ఉప సంచాలకులు సత్యనారాయణరావు, విజయ భాస్కరరావు, విజయకుమార్ పాల్గొన్నారు.

కన్నీరు.. మున్నీరు..

కొన్ని క్షణాలకు ముందు పక్కనే భర్త.. ఆడుకుంటూ బిడ్డలు.. సంతోషంగా జీవిస్తున్న ఆ కుటుంబంపై విధి చిన్నచూపు చూసింది.నీళ్లలో ఆడుకుంటున్న చిన్నారులు మునిగిపోతుండగా కాపాడేందుకు ప్రయత్నించిన భర్త కళ్ల ముందు కడతేరిపోవడంతో ఆ తల్లి కన్నీరుమున్నీరుగా విలపించింది. సరదాలతో నిండిన ఆ కుటుంబంలో ఇప్పుడు ఆమె ఒక్కతే మిగిలింది. ఇక ఒంటరిగానే బతకాలి. చిన్నారులు దేవుడితో సమానం అంటారు. ఆ దేవునికి అభం శుభం తెలియని పసిబిడ్డలపై జాలి కూడా కలగలేదేమో. వారితోపాటు తండ్రిని తీసుకెళ్లిపోయిన విషాద ఘటన మాటల్లో చెప్పలేనిది. బిడ్డల్లారా అప్పుడే నూరేళ్లు నిండాయా..దేవుడా ఏమిటీ ఘోరం అంటూ స్థానికుల కంటతడి పెట్టించిన విషాదకర ఘటన ఇది.

అయ్యో దేవుడా..ఏమిటీ ఘోరం

- చెరువులో ఆడుకుంటూ మునిగిన చిన్నారులు
- వారిని కాపాడేందుకు వెళ్లిన తండ్రి, మరో చిన్నారి మృత్యువాత
- ఒకే కుటుంబంలో ముగ్గురు మృతి
- ములకలచెరువులో తీవ్ర విషాదం



చెరువు నుంచి వెలికితీసిన మృతదేహాలు... చిత్రంలో నందిత మృతదేహం వద్ద విలపిస్తున్న తల్లి మంజుల

ములకలచెరువు: బట్టలు ఉతికేందుకు చెరువు వద్దకు వెళ్తున్న తల్లిని చూసి అమ్మా మేము వస్తామంటూ ఇద్దరు పిల్లలు వెంట వెళ్లారు. వీళ్లతో పాటు పొరుగింటి చిన్నారి కూడా వెళ్లింది. వీరు ముగ్గురు చెరువు నీటిలో ఆడుకుంటూ మునిగిపోతుంటే చూసిన తండ్రి కాపాడేందుకు నీళ్లలోకి దిగి మృత్యువాత పడ్డాడు. ఈ సంఘటన అన్నమయ్య జిల్లా ములకలచెరువు సమీపంలోని పెద్దచెరువులో శనివారం సాయంత్రం జరిగింది. వివరాల్లోకి వెళితే... జగనన్న కాలనీలో ఈశ్వరమ్మ(34), మల్లేష్(38) నివాసం ఉంటున్నారు. వీరికి లావణ్య(12) నందకిషోర్(09) సంతానం. వీరి ఇంటి పక్కనే నందిత(11) అనే బాలిక ఉంటోంది. వీరు ముగ్గురు సమీపంలోని పెద్దచెరువు వద్దకు వెళ్లారు. బట్టలు ఉతుక్కుంటున్న ఈశ్వరమ్మ, మల్లేషలు పిల్లలు ఆడుకుంటున్నారని వారి పనిలో నిమగ్నమయ్యారు. చెరువు కుంటలో ఆడుకుంటూ పిల్లలు మునిగిపోయారు. వీరి అరుపులు వినిపించకపోవడంతో పిల్లల కోసం మల్లేష్ కుంటలోకి దూకాడు.వారిని కాపాడే ప్రయత్నంలో అతను కూడా నీటిలో మునిగిపోయాడు. ముగ్గురు చిన్నారులు మృతిచెందడంతో ములకలచెరువులో విషాద ఛాయలు అలుముకున్నాయి. కళ్లెదుటే పిల్లలు, భర్త మునిగి చనిపోతుంటే వారిని కాపాడేవారి కోసం ఈశ్వరమ్మ గట్టిగా కేకలు వేసింది.అయితే సమీపంలో ఎవ్వరూ లేకపోవడంతో పక్కనే ఉన్న రాజీవ్‌నగర్‌లోకి పరుగెత్తుకెళ్లి స్థానికులకు విషయం చెప్పింది. వెంటనే స్థానికులు చెరువు వద్దకు పరుగుతీసి కాపాడేందుకు ప్రయత్నించారు. అప్పటికే జరగకూడని ఘోరం జరిగిపోయింది.



ప్రమాదం జరగక ముందు చెరువులో తీసుకున్న ఫోటోలతో లావణ్య, నందకిషోర్

ఒంటరిగా మిగిలి...

ఈశ్వరమ్మ, మల్లేష్ కూలిపనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. వీరి పిల్లలు లావణ్య ఆరోతరగతి, నందకిషోర్ ఐదోతరగతి చదువుతున్నారు. రోజూ పాఠశాలకు వెళ్లే పిల్లలు సెలవులు కావడంతో బట్టలు ఉతికేందుకు వెళ్లిన తల్లి వెంట వచ్చారు. చెరువులో నీటిని చూసి మురిసిపోయిన చిన్నారులు ఆడుకుంటూ మడుగులో పడి ఊపిరాడక చనిపోయారు. కాపాడేందుకు వెళ్లిన మల్లేష్ సైతం మునిగి చనిపోయాడు. భర్త పిల్లలు దూరం కావడంతో ఈశ్వరమ్మ ఒంటరిగా మిగిలిపోయింది. కళ్లెదుటే భర్త పిల్లలు చనిపోవడంతో ఆమె బోరున విలపించడం చూసి చూపరులు కంటతడిపెట్టారు.

తోడుగా వెళ్లి...



మృతిచెందిన నందిత (ఫైల్)

జగనన్న కాలనీలో ఉంటున్న మల్లేష్, ఈశ్వరమ్మ ఇంటి పక్కనే మంజుల, వెంకటరమణలు ఉంటున్నారు. వీరికి నందిత అనే కుమార్తె ఉంది. ఇరుగు పొరుగు కావడంతో సఖ్యతతో ఉండేవారు.ముగ్గురు చిన్నారులు కలిసి ఆడుకునేవారు. శనివారం లావణ్య, నందకిషోర్ ఈశ్వరమ్మ వెంట వెళుతుండగా నేను వస్తానని నందిత వెళ్లింది. చెరువులో ఆడుకుంటూ ముగ్గురు మునిగి చనిపోయారు. ఒక్కగానొక్క కుమార్తె మృతి చెందడంతో అయ్యో దేవుడా మేమేం పాపం చేశాం అంటూ మంజుల, వెంకటరమణలు బోరున విలపిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పర్యాటక కేంద్రాల్లో హోంస్టేల నిర్మాణం జరగాలి

జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్



పర్యాటక అభివృద్ధిపై అధికారులతో సమీక్ష చేస్తున్న, కలెక్టర్ శ్రీధర్


రాయచోటి: జిల్లా ఆర్థికాభివృద్ధి, సాంస్కృతిక పరిరక్షణకు పర్యాటక రంగం అభివృద్ధి కీలకమని, అందుకు అనుగుణంగా పర్యాటక కేంద్రాల్లో హోం స్టేల నిర్మాణం జరగాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. శనివారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా పర్యాటక కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలో జరుగుతున్న పర్యాటక అభివృద్ధి పనుల గురించి పర్యాటక శాఖ అధికారి నాగభూషణం వివరించారు. హార్స్లీహిల్స్‌లో చేపట్టబోయే వివిధ ప్రాజెక్టులు, అన్నమాచార్య కీర్తనలను ప్రచారం చేయడం, రాయచోటిలో శిల్పారామ నిర్మాణంలో ప్రగతి తదితర అంశాలను కలెక్టర్ దృష్టికి తెచ్చారు. రాయచోటి, పీలేరు, రాజంపేటలలో నిర్మించబోయే మూడు నక్షత్రాల హోటళ్లకు ఒక్కో చోట గుర్తించిన 5 ఎకరాల భూములను పర్యాటక శాఖకు అప్పగించే దిశగా చర్యలు చేపట్టాలని సబ్ కలెక్టర్లను కలెక్టర్ ఆదేశించారు. హార్సిలీహిల్స్‌లో గిరిజన కార్పొరేషన్ వారు అరకు కాఫీ కోసం గుర్తించిన స్థలాన్ని అప్పగించేందుకు చర్యలు తీసుకోవాలని మదనపల్లె సబ్ కలెక్టర్‌ను ఆదేశించారు. అక్కడే లేపాక్షి స్టాల్ ఏర్పాటుకు స్థలాన్ని గుర్తించి పర్యాటక శాఖకు అందజేయాలన్నారు. స్వయం సహాయక బృందాలతో హోమ్ స్టేలను నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని పీడీ డీఆర్‌డీఏను ఆదేశించారు. ∩ రాయచోటిలోని శిల్పారామం నిర్మాణంలో పురోగతి సాధించాలని పర్యాటక శాఖ అధికారిని ఆదేశించారు. సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శరాజేంద్రన్, మదనపల్లె రాజంపేట సబ్ కలెక్టర్లు మేఘస్వరూప్, నైదియాదేవి, పర్యాటక శాఖ రీజనల్ డైరెక్టర్ రమణప్రసాద్, ఏపీటీడీసీ ఈఈ సుబ్రమణ్యం, జిల్లా పర్యాటక శాఖ అధికారి నాగభూషణం, పీడీ డీఆర్‌డీఏ సత్యనారాయణ, ఏపీఎస్ఆర్టీసీ జిల్లా అధికారి రాము, జిల్లా దేవదాయశాఖ అధికారి విశ్వనాథ్, మదనపల్లె మున్సిపల్ కమిషనర్ ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

- ప్రభుత్వ పథకాల్లో వందశాతం లక్ష్యాలను సాధించాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ అధికారులను ఆదేశించారు. శనివారం ఇక్కడ ఆయన మాట్లాడుతూ ప్రతి మండలంలో ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుకు ఫిజబిలిటీ నివేదిక వెంటనే పంపాలని సూచించారు. జిల్లాలో పచ్చిమేత పెంపకానికి డివిజన్, మండలస్థాయిలో అందుబాటులో ఉన్న ప్రభుత్వ, డికేటీ, ప్రైవేటు భూములను ప్రతి మండలంలో కనీసం 3 వేల ఎకరాలను గుర్తించాలన్నారు.

మదనపల్లెలో ఐదుగురు పాకిస్తానీయులు

దేశం విడిచి వెళ్లాల్సిందిగా ఎస్పీ నోటీసులు

మదనపల్లె: మదనపల్లె పట్టణంలో పాకిస్తాన్ పౌరసత్వం కలిగిన ఐదుగురు స్థిర నివాసం ఏర్పరచుకుని ఇక్కడే నివసిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. శనివారం ఉదయం పట్టణంలోని కురువంక ఇండియన్ పబ్లిక్ స్కూల్ సమీపంలో నివాసం ఉంటున్న వారికి జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు నోటీసులు అందించి తక్షణం దేశం విడిచి వెళ్లాల్సిందిగా ఆదేశించారు. అయితే దీనికి సంబంధించి తదుపరి ఉత్తర్వులు ఏవి రాకపోవడంతో ప్రస్తుతానికి వారు మదనపల్లెలోనే ఉన్నారు. మదనపల్లె అంజనేయ స్వామి గుడి వీధికి చెందిన గులాబ్ జాన్ చాలా కాలం క్రితం సౌదీకి వెళ్లి అక్కడ పాకిస్తానీయుడైన బషీర్ అహ్మద్ భట్‌ను పెళ్లి చేసుకుంది. వీరికి ఐదుగురు పిల్లలు. వారికి పాకిస్తాన్ పౌరసత్వం ఉంది. తర్వాత పిల్లలను తీసుకొని గులాబ్‌జాన్ మదనపల్లెకు చేరుకుంది. తర్వాత ఇక్కడ ఇంకో కుమారుడు జన్మించాడు. అతడికి భారత దేశ పౌరసత్వం ఉంది. మదనపల్లెలో ఉంటున్న పాకిస్తాన్ పౌరసత్వం కలిగిన గులాబ్ జామ్ అయిదుగురు సంతానం... ఇక్కడే ఎల్కేజీ నుంచి డిగ్రీ వరకు చదువుకున్నారు. పాకిస్తాన్ పౌరసత్వం కలిగినప్పటికీ, ఇండియాలో రెసిడెన్స్ వీసా పొంది రెన్యువల్ చేసుకుంటూ ఇక్కడే నివాసంఉంటున్నారు. గులాబ్ జాన్ ఐదుగురు పిల్లల్లో ఇద్దరు మగపిల్లలు,ముగ్గురు ఆడపిల్లలు...వారిలో పెద్ద కూతురు షాజియా ఖాన్వాల్ (35) ఈమె బెంగళూరులో కేరళకు చెందిన వ్యక్తిని పెళ్లి చేసుకుంది. మహమ్మద్ యాసీన్(32)...ఇతను మదనపల్లిలో స్టార్ క్యాటరింగ్లో పని చేసుకుంటూ మదనపల్లెకి చెందిన అమ్మాయిని వివాహం చేసుకున్నాడు. షమ్మా బషీర్‌అహ్మద్... వాయల్పాడులో పెళ్లి చేసుకుంది.యాసర్ బషీర్, ఫాతిమా బషీర్ ఇద్దరూ అవివాహితులు. అన్నమయ్య జిల్లా ఎస్పీ సెలవులో ఉండటంతో కడప ఎస్పీ వీరికి నోటీసులు జారీ చేశారు.మదనపల్లెలోఐదుగురు పాకిస్తానీయులు ఉన్న విషయం పోలీసు వర్గాల్లో కలకలం రేపింది.









క్లుప్తంగా

జిల్లా వ్యాప్తంగా పోలీసుల స్పెషల్ డ్రైవ్



పోలీసు జాగిలాలతో తనిఖీ చేస్తున్న దృశ్యం

రాయచోటి : దేశంలో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. జిల్లా అదనపు ఎస్పీ వెంకటాద్రి ఆధ్వర్యంలో శనివారం రెండో రోజు కూడా ఆకస్మిక తనిఖీలు, పరిశీలనలను జరిపారు. జిల్లాలోని రైల్వేస్టేషన్లు, బస్టాండులు, ముఖ్యమైన ప్రాంతాలలో పోలీసు జాగిలాలు, బాంబు స్క్వాడ్ బృందాలతో విస్తృతంగా తనిఖీలు చేశారు. నేర నియంత్రణ శాంతి భద్రతల పరిరక్షణ కోసమే తనిఖీలు, సోదాలు చేస్తున్నట్లు అదనపు ఎస్పీ ఎం.వెంకటాద్రి తెలిపారు. ఆకస్మిక తనిఖీలలో సబ్ డివిజన్ పోలీసు అధికారులు, సీఐలు, ఎస్ఐలు, ఆర్మ్డ్ రిజర్వ్ పోలీసు బలగాలు, స్పెషల్ పార్టీ సిబ్బంది, పోలీసు సిబ్బంది, హోంగార్డులు పాల్గొన్నారు.

మామిడి చెట్లు నరికివేత




మామిడిచెట్లను నరికివేసిన దృశ్యం

చిన్నమండెం : మండల పరిధిలోని దేవగుడిపల్లె గ్రామం కొండమూలకు చెందిన బూసర శ్రీనివాసులు అనే రైతుకు చెందిన మామిడిచెట్లను గుర్తు తెలియని వ్యక్తులు నరికివేసినట్లు బాధిత రైతు తెలిపారు. ఆయన కథనం మేరకు.. తనకు గల 3 ఎకరాల పొలంలో మామిడి చెట్లను సాగు చేసినట్లు తెలిపారు. అయితే శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు అందులో 15 మామిడిచెట్లను నరికివేశారని తెలిపారు. అధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని ఆయన కోరారు.

ట్రిపుల్ ఐటీలతో.. ఉజ్వల భవిష్యత్తు

- ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల
- నేటి నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- పదవ తరగతి మార్కుల ఆధారంగా విద్యార్థుల ఎంపిక
- 2008లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ట్రిపుల్ ఐటీల ఏర్పాటు
- ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులకు నాలుగు శాతం డిప్రివేషన్ స్కోరును జోడించి అభ్యర్థుల ఎంపిక



ఇడుపులపాయలోని ఆర్‌కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ ముఖ ద్వారం

వేంపల్లె : రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ(ఆర్జీయూకేటీ)లో 2025–26 విద్యా సంవత్సరానికి అడ్మిషన్ల కోసం నోటిఫికేషన్ విడుదలైంది. ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ ఇంజినీరింగ్ ప్రోగ్రాంలో భాగంగా రాష్ట్రంలోని నాలుగు ట్రిపుల్ ఐటీల్లో ఒక్కో ట్రిపుల్ ఐటీకి 1000 సీట్ల చొప్పున 4వేల సీట్లను ఆర్జీయూకేటీ అధికారులు కేటాయించారు. అలాగే ఈబీసీ కోటా కింద ఒక్కో ట్రిపుల్ ఐటీకి 100 సీట్ల చొప్పున 400 సీట్లను కేటాయించారు. 2024–25 విద్యా సంవత్సరంలో 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థుల చూపంతా ట్రిపుల్ ఐటీ వైపు మళ్లింది. ఈ నెల 24వ తేదీన నోటిఫికేషన్ విడుదల కాగా.. ఈ నెల 27వ తేదీ ఉదయం 10 గంటల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తారు. మే 20వ తేదీ సాయంత్రం 5గంటల వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉంది. ఎంపికైన అభ్యర్థుల జాబితా జూన్ 6న విడుదల చేస్తారు. జూన్ 11 నుంచి 17 వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహిస్తారు. స్పెషల్ కేటగిరి (పీహెచ్‌సీ/ క్యాప్/ఎన్‌సీసీ/స్పోర్ట్స్/భారత్ స్కౌట్స్) కోటా అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ను మే 28 నుంచి 31వ తేదీ వరకు నూజివీడు ట్రిపుల్ ఐటీలో నిర్వహిస్తారు. అడ్మిషన్ల ప్రక్రియ పూర్తయిన అనంతరం జూలై మొదటి వారంలో తరగతులు ప్రారంభించే అవకాశం ఉంది.

గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అత్యున్నత సాంకేతిక విద్యను అందించేందుకు 2008లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి ఇడుపులపాయ, నూజివీడు, తెలంగాణా రాష్ట్రంలోని బాసరలో ట్రిపుల్ ఐటీలను ఏర్పాటు చేశారు. ప్రారంభంలో ఒక్కోదానికి 2000 సీట్లను కేటాయించగా.. తర్వాత ప్రభుత్వాలు 2010లో ఒక ట్రిపుల్ ఐటీలో 1000 సీట్లు ఉండేలా కుదించారు. 2014 రాష్ట్ర విభజన అనంతరం బాసర ట్రిపుల్ ఐటీ తెలంగాణకు వెళ్లిపోవడంతో 2016లో ఏపీలో ఒంగోలు, శ్రీకాకుళంలో ట్రిపుల్ ఐటీలను ప్రారంభించారు. వీటిలో 26 జిల్లాల విద్యార్థులకు సమానంగా సీట్లు ఇవ్వాలని యూనివర్సిటీ అధికారులు నిర్ణయించారు. 4000 సీట్లలో ఓపెన్ కేటగిరిలో 600 సీట్లను స్థానికేతరులు, తెలంగాణ ఎన్ఆర్ఐ, తదితరులకు కేటాయిస్తారు. మిగిలిన 3400 సీట్లను 26 జిల్లాల వారికి సమానంగా పంచుతారు. జిల్లాకు కేటాయించే సీట్ల ఆధారంగా మెరిట్ విద్యార్థులకు అవకాశం లభించనుంది. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి చదివిన విద్యార్థులకే ట్రిపుల్ ఐటీల్లో అధిక సీట్లు వచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులైన వారికే ఈ అవకాశాలు మెండుగా ఉన్నాయి.

ఎంపిక ప్రక్రియ ఇలా

ఎంపిక ప్రక్రియలో భాగంగా ఇద్దరు విద్యార్థులకు సమాన మార్కులు వస్తే తొలుత గణితం అనంతరం జనరల్ సైన్స్ తర్వాత ఇంగ్లీషు, సోషల్ స్టడీస్, ఫస్ట్ లాంగ్వేజ్‌లో అధిక మార్కులు వచ్చిన వారికి ప్రాధాన్యత ఇస్తారు. అప్పటికి సమానంగా వస్తే పుట్టిన తేదీ ప్రకారం అధిక వయస్సు ఉన్న వారిని హాల్ టికెట్ నెంబర్ నుంచి పొందిన అత్యల్ప సంఖ్య ఆధారంగా ఎంపిక చేస్తారు.

నేటి నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు..

ట్రిపుల్ ఐటీలలో చేరేందుకు ఆసక్తి ఉన్న విద్యార్థులు గిగిగి. ఖ్ఖటఖీ. ఖ్రా. అ్క వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. బీసీ, ఈడబ్ల్యూఎస్, ఓసీ విద్యార్థులకు దరఖాస్తు రుసుము రూ.300లు కాగా, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.200లుగా నిర్ణయించారు.

రూల్ ఆఫ్ రిజర్వేషన్

ట్రిపుల్ ఐటీలో అడ్మిషన్లకు రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను పాటిస్తారు. రాష్ట్రంలోని అభ్యర్థులకు 85 శాతం సీట్లు, మిగిలిన 15 శాతం సీట్లు రాష్ట్ర పునర్విభజన చట్టం 2014 ప్రకారం రెండు తెలుగు రాష్ట్రాల్లోని విద్యార్థులకు కేటాయిస్తారు. అడ్మిషన్లలో కచ్చితంగా రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటిస్తారు. ఎస్సీ–15 శాతం, అనగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఆర్డినెన్స్–2 ప్రకారం ఎస్సీ గ్రూపు–1 కి 1 శాతం, గ్రూప్– 2 కి 6.5 శాతం, గ్రూప్ –3 కి 7.5 శాతం ప్రకారం సీట్లను భర్తీ చేస్తారు. మిగిలిన కేటగిరీలో ఎస్టీ–6, బీసీ(ఏ)–7, బీసీ(బి)–10, బీసీ (సి)1, బీసీ (డి)7, బీసీ(ఈ) 4, దివ్యాంగులకు–5 శాతం ప్రకారం సీట్లను భర్తీ చేస్తారు. ఆర్మీ ఉద్యోగుల పిల్లలు (సీఏపీ)–2, ఎన్‌సీసీ–1, స్పోర్ట్స్–0.5, భారత్ స్కౌట్స్ అఫ్ గైడ్స్–0.5 శాతం సీట్లు కేటాయిస్తారు. ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కేటగిరిలో బాలికలకు 33.1/3 శాతం సీట్లు కేటాయిస్తారు.

మొత్తం 4400 సీట్లు

రాష్ట్రంలోని ఇడుపులపాయ, నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీల్లో ఒక్కో క్యాంపస్‌కు 1000 సీట్ల చొప్పున మొత్తం 4వేల సీట్లు ఉన్నాయి. అదేవిధంగా ఈబీసీ కోటా కింద ఒక్కో క్యాంపస్‌కు 100 సీట్ల చొప్పున 400 సీట్లు ఉన్నాయి. వీటికి సంబంధించిన నోటిఫికేషన్ రాష్ట్ర ప్రభుత్వం గురువారం విడుదల చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 2024–25 విద్యా సంవత్సరంలో జరిగిన 10వ తరగతి పరీక్షల్లో 6,14,459 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, అందులో 4,98,585 మంది ఉత్తీర్ణత సాధించారు. వీరిలో బాలురు 2,45,307 మంది, బాలికలు 2,53,278 మంది ఉత్తీర్ణులయ్యారు. ఈ ఏడాది ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులైన వారి సంఖ్య అధికంగా ఉండడంతో గట్టి పోటీనే ఉంటుందని పలువురు భావిస్తున్నారు.

అన్ని జిల్లాలకు సమానంగా సీట్లు



ఆర్జీయూకేటీ పరిధిలోని అన్ని ట్రిపుల్ ఐటీల్లో ఆయా జిల్లాల్లో సమానంగా సీట్లు కేటాయిస్తాం. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు 4శాతం, డిప్రివేషన్ స్కోరును జోడించి మెరిట్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తాం. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.

– ప్రొఫెసర్ అమరేంద్ర కుమార్ సండ్ర(ఆర్జీయూకేటీ అడ్మిషన్స్ కన్వీనర్), ఇడుపులపాయ

కోదండ రాముడికి స్నపన తిరుమంజనం



మూల వరులకు పట్టువస్త్రాలను తీసుకొస్తున్న ఆలయ అధికారులు

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి దేవాలయంలో శనివారం స్వామి వారికి టీటీడీ అధికారుల ఆధ్వర్యంలో ఆలయ పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ టీటీడీ అధికారులు స్వామి వారికి పట్టు వస్త్రాలను సమర్పించి, పండితులచే స్వామివారిని అలంకరించి, పాలు, పెరుగు, నెయ్యి, కొబ్బరి నీళ్లతో అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

రఘురామకృష్ణమరాజు డిప్యూటీ స్పీకర్‌గా అనర్హుడు

మదనపల్లె : నీతి, నిజాయితీకి నిలువెత్తు నిదర్శనం కమ్యూనిస్టులే. మీకు తెలియకపోతే మీ వాళ్లని అడగండి.. లేకుంటే మీ పార్టీ నేతలను అడిగి తెలుసుకోండి' అని సీపీఎం అన్నమయ్య జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణమరాజుకు సూచించారు. శనివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో శ్రీనివాసులు మాట్లాడుతూ... సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుపై డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు వ్యాఖ్యలు అవమానకరంగా, అసభ్యకరంగా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. పశ్చిమ గోదావరి జిల్లాలో పేదల గుడిసెలు తొలగింపునకు నిరసనగా గళమెత్తిన సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస రావు పై అనుచితవ్యాఖ్యలు దారుణమన్నారు.

ఉద్యోగాలు పీకేసిన పాపం చంద్రబాబు, లోకేష్, పవన్‌లదే

మాజీ ఎమ్మెల్యే కొరముట్ల



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు అర్బన్ : మంగంపేటలో స్థానిక యువకులకు తమ ప్రభుత్వంలో ఉద్యోగాలు కల్పిస్తే అందులో 375 మందికి ఉద్యోగాలు పీకేసి వారి కుటుంబాలు రోడ్డున పడేటట్లు చేసిన పాపం ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేష్‌లదేనని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు విమర్శించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఏపీఎండీసీలో తీసేసిన ఉద్యోగులను తిరిగి చేర్చుకోకుంటే విజయవాడ, మంగంపేటలలో ఆందోళనలు చేసేందుకు ప్రజా సంఘాలు, ఇతర పార్టీలతో కలిసి కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. ఎన్నికల ముందు చంద్రబాబు, లోకేష్‌లు 25 లక్షల మందికి ఉద్యోగాలు, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇస్తామని అధికారంలోకి వచ్చాక ఉన్న ఉద్యోగాలు ఊడగొడుతూ యువకులకు ద్రోహం చేస్తున్నారన్నారు. చంద్రబాబు అవసరాలకు మంగంపేట ఖనిజం కావాలి కానీ ఇక్కడి ప్రజలకు ఉద్యోగాలు వద్దా అని నిలదీశారు. దీనిపై స్థానిక ఎమ్మెల్యే, ఇన్‌చార్జి, కూటమి నాయకులు స్పందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, మండల నాగేంద్ర, తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల్లో విశ్వసనీయత పెంచాలి

- నేర సమీక్షలో జిల్లా అదనపు ఎస్పీ వెంకటాద్రి



నేర సమీక్షలో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ వెంకటాద్రి

రాయచోటి : పోలీసు శాఖపట్ల ప్రజల్లో విశ్వసనీయత పెంపొందేలా విధులు నిర్వర్తించాలని జిల్లా అదనపు ఎస్పీ ఎం.వెంకటాద్రి పోలీసు అధికారులను ఆదేశించారు. శనివారం రాయచోటిలోని పోలీసు కార్యాలయంలో రాజంపేట సబ్ డివిజన్ పోలీసు అధికారులతో నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలని, ముఖ్యంగా గ్రేవ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలన్నారు. దర్యాప్తులో శాస్త్రీయ ఆధారాలను సేకరించడంపై దృష్టి పెట్టాలని సూచించారు. నేరస్తులకు శిక్షపడేలా పటిష్టమైన సాక్ష్యాధారాలతో చార్జ్‌షీట్లను నిర్దీత గడువులోగా కోర్టులో దాఖలు చేయాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో జరిగే నేరాలను అరికట్టడానికి బీట్ పోలీసులు, రక్షక్ బృందాలు అప్రమత్తంగా ఉండాలని, గస్తీ ముమ్మరం చేయాలని చెప్పారు. రహదారి భద్రతపై ప్రత్యేక దృష్టి సారించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. సైబర్ నేరాలపట్ల ప్రజలను అప్రమత్తంగా చేయాలని, ఆన్‌లైన్ మోసాల బారిన పడకుండా అవగాహన కల్పించాలని కోరారు. ఎర్రచందనం స్మగ్లర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాజంపేట ఏఎస్పీ మనోజ్ రామనాథ్ హెగ్డే, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ఉగ్రవాదులను బహిరంగంగా ఉరి తీయాలి



రాజంపేట టౌన్: కొవ్వొత్తులతో నివాళులు అర్పిస్తున్న ముస్లీం మైనార్టీ నాయకులు

రాజంపేట టౌన్ : పహల్గాంలో అభంశుభం తెలియని 28 మందిని పొట్టన పెట్టుకున్న ఉగ్రవాదులను బహిరంగంగా ఉరి తీయలాని పట్టణంలోని ముస్లీం మైనార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఉగ్రవాదుల ఉన్మాదాన్ని నిరసిస్తూ, ఉగ్రవాదుల చేతిలో అసువులు బాసిన వారి ఆత్మ శాంతి కోసం శనివారం రాత్రి ముస్లీం మైనార్టీ నాయకులు ఆర్అండ్‌బీ బంగ్లా వద్ద కొవ్వొత్తులతో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ముస్లీం మైనార్టీ నాయకులు మాట్లాడుతూ దేశంలో ఉగ్రవాదాన్ని కూకటి వేళ్లతో పెకలించేందుకు కేంద్రం గట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందుకు కేంద్ర ప్రభుత్వానికి ప్రతి భారతీయుడు అండగా నిలుస్తాడని తెలిపారు.

ముగ్గురాయిని రాయితీపై మిల్లులకు ఇవ్వాలి



మాట్లాడుతున్న తల్లెం భరత్ కుమార్ రెడ్డి

ఓబులవారిపల్లె : మంగంపేట గనుల ఆధారితంగా ఏర్పాటు చేసుకున్న పల్వరైజింగ్ మిల్లులకు ఏపీఎండీసీ యాజమాన్యం రాయితీపై ముగ్గురాయిని సరఫరా చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాయలసీమ జోనల్ బూత్ కమిటీ అధ్యక్షుడు తల్లెం భరత్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం మంగంపేట కారుపల్లిలోని ఆయన క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి 296 జీఓ ప్రకారం మిల్లులకు రాయితీలు కల్పించి ప్రోత్సహించారన్నారు. ప్రస్తుతం ఖనిజ సరఫరా నిలిపివేయడంతో పల్వరైజింగ్ మిల్లులు పూర్తిగా మూతపడ్డాయన్నారు. ప్రభుత్వం వెంటనే స్థానికంగా ఉన్న మిల్లులకు రాయితీపై ఏ గ్రేడ్, బి గ్రేడ్, సి గ్రేడ్, డి గ్రేడ్ ఖనిజాన్ని సరఫరా చేసి ఆదుకోవాలన్నారు.

వృద్ధుడి ఆత్మహత్యాయత్నం



ఆత్మహత్యకు యత్నించిన వృద్ధుడు అబ్బిరెడ్డి

సిద్దవటం : భార్య అనారోగ్యంతో బాధపడుతుంటే తట్టుకోలేని ఓ వృద్ధుడు భార్య కంటే ముందుగా తానే చనిపోవాలని నిర్ధారించుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వృద్ధుడిని రైల్వే సిబ్బంది కాపాడారు. వివరాల్లోకి వెళితే.. అట్లూరు మండలం, అట్లూరు క్రాస్ రోడ్డులో నివాసం ఉంటున్న జె. అబ్బిరెడ్డికి ఒక కొడుకు, ఒక కూతురు ఉన్నారు. అయితే ఇటీవల భార్య లక్ష్మీదేవి ఆరోగ్యం సరిగా లేనందున ఆమెకు ఏమైనా అవుతుందనే భయంతో, భార్యకంటే ముందుగా తాను చనిపోవాలని భావించాడు. శనివారం సిద్దవటం మండలం కనుమలోపల్లె గ్రామ సమీపంలో ఉన్న రైల్వే స్టేషన్ వద్దకు ఉదయం 8 గంటలకే వచ్చి రైల్వే స్టేషన్‌లో రైలు కింద పడబోతుండగా రైల్వే సిబ్బంది గమనించి వృద్ధుని ప్రాణాలు కాపాడారు. ఈ విషయాన్ని సిద్దవటం ఎస్ఐ మహమ్మద్ రఫీకి రైల్వే సిబ్బంది సమాచారం ఇచ్చారు. ఆత్మహత్య అనేది సమస్యకు పరిష్కారం కాదని, వృద్ధురాలికి సరైన వైద్యం చేయించాలని కౌన్సిలింగ్ ఇచ్చి వారి బంధువులకు అప్పగించారు.

గ్రీస్ దేశంలో ఉద్యోగావకాశాలు

రాయచోటి టౌన్ : గ్రీస్ దేశంలో ఉద్యోగావకాశాలు ఉన్నట్లు అన్నమయ్య జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) అధికారి దాసరి నాగార్జున శనివారం ఒక ప్రకటలో తెలిపారు. ఇంటర్నేషనల్ ప్లేస్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారన్నారు. వివరాల కోసం 9888533335, 8712655686, 8790118349, 8790117279లకు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన శనివారం మదనపల్లెలో జరిగింది. నీరుగట్టువారిపల్లె రామిరెడ్డి లేఅవుట్‌కు చెందిన నరసింహులు కుమారుడు మల్లికార్జున(26)కు ఇటీవల వివాహం నిశ్చయమైంది. అయితే అకస్మాత్తుగా వధువు తరపువారు పెళ్లికి నిరాకరించడంతో మనస్తాపం చెంది నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు బాధితుడిని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

రైలు కిందపడి మహిళ మృతి

పుల్లంపేట : మండల పరిధిలోని దేవసముద్రం వడ్డిపల్లికి చెందిన పసుపులేటి సీతమ్మ శనివారం ఉడుమువారిపల్లికి సమీపంలోని రైల్వేట్రాక్‌పై రైలు కింద పడి మృతి చెందింది. ఆమె మృతి విషయాన్ని తెలుసుకున్న కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. ఈ ఘటనపై రేణిగుంట రైల్వే పోలీసు గౌరీ శంకర్ కేసు నమోదు చేశారు.

ఆర్టీసీ బస్సు, బొలేరో వాహనం ఢీ

ఒకరి మృతి, 14 మంది ప్రయాణికులకు గాయాలు



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రామాంజులరెడ్డి

రామాపురం : కర్నూలు – చిత్తూరు జాతీయ రహదారిలోని రామాపురం మండలం హసనాపురం పంచాయతీ టోల్‌గేట్ సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరో 14 మంది ప్రయాణిలకు తీవ్ర గాయాలయ్యాయి. ఎస్ఐ వెంకట సుధాకర్‌రెడ్డి తెలిపిన వివరాలు...రాయచోటి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు వంగిమళ్ల నుంచి రాయచోటికి వస్తుండగా టోల్‌గేట్ సమీపంలో బొలెరో వాహనానికి టైరును మారుస్తుండగా వెనుక వైపు నుంచి ఆర్టీసీ బస్సు ఢీ కొంది. మండల పోలీసులు వెంటనె సంఘటన స్థలానికి చేరుకొని డ్రైవర్ ప్రసాద్‌రెడ్డి, కండక్టర్ నరసింహులుతో పాటు 14 మంది ప్రయాణికులను 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయపడినవారిలో వంగిమళ్లకు చెందిన రామాంజులరెడ్డి, చిన్నబాబు, సుమిత్ర, రెడ్డిరాణి, విజయ్‌కుమార్‌రెడ్డి, ఆస్మా, మన్విత, మాన్యత, పొలిమేరపల్లెకు చెందిన రమాదేవి, జగదీష్, గీతావాణి, మహేష్, ఉప్పరపల్లెకు చెందిన రాణెమ్మ, సుండుపల్లె చౌడయ్య, వీరబల్లి మండలానికి చెందిన సుమిత్ర, గంగనేరుకు చెందిన జమున ఉన్నారు. మెరుగైన వైద్యం కోసం రామాంజులరెడ్డి, రాదేవి, జగదీష్, బాబు, గీతావాణిలను కడప రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ రామాంజులరెడ్డి(80) మృతి చెందారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఇళ్లు మావి... పరిహారం వేరొకరికా..?



సీటీఎం గంగమ్మగుడి ఎదుట నిరసన తెలుపుతున్న బాధితులు

మదనపల్లె : 21 ఏళ్ల క్రితం కొనుగోలు చేసిన పట్టా ఇళ్ల స్థలాలను ఆర్వోబీ నిర్మాణానికి తీసుకుని, పరిహారం వేరొకరికి ఇవ్వడమేంటని నిర్వాసితులు శనివారం సీటీఎంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ...సీటీఎం గంగమ్మగుడి ఎదుట 21 ఏళ్ల క్రితం ఇళ్ల స్థలాలను లలిత కుమారి నుంచి తాము కొనుగోలు చేసి ఇళ్లు నిర్మించుకుని అందులో నివసిస్తున్నామన్నారు. సీటీఎం వద్ద నిర్మిస్తున్న రైల్వే ఓవర్‌బ్రిడ్జ్(ఆర్ఓబీ) నిర్మాణానికి ఇళ్ల స్థలాలు అవసరమై తమకు నోటీసులు అందజేశారన్నారు. అయితే నష్టపరిహారం మాత్రం తమకు అందివ్వకుండా తమకు ఇళ్ల స్థలాలు విక్రయించిన లలితకుమారికి ఇచ్చేందుకు రెవెన్యూ అధికారులు సన్నాహాలు చేస్తున్నారన్నారు. డబ్బులు చెల్లించి తాము కొనుగోలుచేసి, అనుభవంలో ఉంచుకున్న స్థలాలను ఆర్వోబీ నిర్మాణానికి ఇచ్చేందుకు తమకు అభ్యంతరం లేదని, అయితే పరిహారం తమకే చెల్లించాలని డిమాండ్ చేశారు. రెవెన్యూ అధికారులు తమకు అన్యాయం చేస్తే ఆర్వోబీకి ఇళ్ల స్థలాలు ఇచ్చేది లేదన్నారు. కార్యక్రమంలో బాధితులు వై.రెడ్డిశేఖర్, రెడ్డెప్ప, శ్రీనివాసులు, పాపులమ్మ, సి.చంద్రశేఖర్, ఎస్.రాజశేఖర్, వేణునాయుడు పాల్గొన్నారు.

సబ్ జూనియర్ షూటింగ్‌బాల్ పోటీలు ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ చైర్మన్ జునైద్ అక్బరీ

మదనపల్లె సిటీ : స్థానిక పుంగనూరురోడ్డులోని వశిష్ఠ స్కూలులో శనివారం 8వ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాల, బాలికల షూటింగ్‌బాల్ చాంపియన్ షిప్ పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను జిల్లా షూటింగ్‌బాల్ అసోసియేషన్ చైర్మన్ జునైద్ అక్బరీ, వశిష్ఠ స్కూల్ చైర్మన్ డాక్టర్ పీవీఆర్ గుప్తా ప్రారంభించారు. రాష్ట్ర షూటింగ్‌బాల్ కార్యదర్శి పరుశురాముడు మాట్లాడుతూ సబ్ జూనియర్ రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన జట్టును ఎంపిక చేసి మే 7 నుంచి తమిళనాడు రాష్ట్రంలో జరిగే పోటీలకు పంపుతామన్నారు. కార్యక్రమంలో షూటింగ్ బాల్ అసోసియేషన్ రాయలసీమ కన్వీనర్ నరేష్‌బాబు, జిల్లా కార్యదర్శి మురళీధర్, ఆర్గనైజింగ్ కార్యదర్శి మురళీధర్, గురుప్రసాద్, పీడీలు నాగరాజు, భారతి, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.